క్లుప్తంగా

28న కూచిపూడిలో సుదర్శన యాగం

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూడిపూడిలో గల శ్రీసీతారామాంజనేయ లక్ష్మీనరసింహ వానర మారుతీ స్వయంభు దివ్యక్షేత్రంలో ఈ నెల 28న మహా సుదర్శన నారసింహ యాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందికొండ సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులుచే ఈ యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోటి రూపాయలు మంజూరు చేయించడం పట్ల మున్సిపల్ పాలక వర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మినీ స్టేడియంకు మంత్రి ఉత్తమ్ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడం పట్ల పట్టణ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఉపేందర్‌కు నగదు అందజేస్తున్న తోటి జర్నలిస్టులు

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లుకు చెందిన టీవీ జర్నలిస్ట్ బాలెబోయిన ఉపేందర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం టీయుడబ్ల్యూజే 143 యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ సభ్యులు ఉపేందర్‌ను పరామర్శించి రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ కోదాడ అధ్యక్షుడు పడిశాల రఘు మాట్లాడారు. సంఘ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్ ఆదేశాల మేరకు ఆర్థికసాయం చేసేందుకు సభ్యులు ముందుకొచ్చినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో మరికంటి లక్ష్మణ్, గంధం వెంకటనారాయణ, తోటపల్లి నాగరాజు, నజీర్, చీమ శేఖర్, పవన్‌కుమార్, సైదులు, శ్రీ హరి, రామారావు, శ్రీనివాస్, అంజి ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి



అవిరేణికుంటతండాలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండలంలో పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎం.జానకిరాములు అన్నారు. శనివారం మఠంపల్లి మండలంలోని అవిరేణికుంటతండాలో పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

రామారావుకు నివాళి

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురంలో చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దివంగత కృష్ణసాగరపు రామారావు 5వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు, నాయకులు పొన్నం యేసయ్య, వీరబాబు, పవన్, సౌభాగ్యం, రామానుజమ్మ, పద్మావతి, స్వర్ణలత పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటిక పనుల పరిశీలన

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గుట్ట వద్ద క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేయించడంతో నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయని పాస్టర్లు సుధాకర్, శామ్యూల్ హర్షం వ్యక్త చేశారు. శనివారం శ్మశాన వాటిక పనులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్ రాజ్, పీటర్, హనోక్, జాన్‌పాల్, సైదులు తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు యలక సైదులు గౌడ్ కుటుంబసభ్యులను శనివారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా శ్రీలతారెడ్డి పరామర్శించారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, హరీష్, ఉమ మహేశ్వర రావు, గోపి, ఉపేందర్, నరసింహారావు, రమేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుకు గ్రీన్ సిగ్నల్

- యాతవాకిళ్ల- హుజూర్‌నగర్ రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు ప్రణాళిక
- రూ. 20 కోట్ల నిధులు మంజూరు
- పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



డబుల్ లేన్‌గా మారనున్న యాతవాకిళ్ల- హుజూర్‌నగర్ రోడ్డు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల నుంచి హుజూర్‌నగర్ వరకు గల సింగిల్ లేన్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. మూడురోజుల క్రితం రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. దీంతో డబుల్ రోడ్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పనున్న తిప్పలు

కాగా, యాతవాకిళ్ల- హుజూర్‌నగర్ రోడ్డుపై నుంచే నిత్యంమండలంలోని యాతవాకిళ్ల, భీల్యానాయక్ తండా, చెన్నాయిపాలెం తదితర గ్రామాలతో పాటు హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన హుజూర్‌నగర్‌కు చేరుకునేందుకు వెళ్తుంటారు. ప్రస్తుతం సింగిల్ రోడ్డు కావడం, అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై గడిచిన దశాబ్దకాలంగా కనీసం ఆర్టీసీ బస్సు కూడా సక్రమంగా నడవక పోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఎలాంటి వాహనాలు దొరకని పరిస్థితి. అదేవిధంగా ఈ రోడ్డుపై ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. త్వరలో డబుల్ రోడ్డుగా మారితే సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి. అయితే హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి వరకు ఇప్పటికే రోడ్డు నిర్మాణం పూర్తికాగా, శ్రీనివాసపురం, అమరవరం, తదితర గ్రామాల మీదుగా యాతవాకిళ్లకు 9.5 కిలో మీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణం కానుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు తీరనున్నాయి. ప్రయాణం సౌకర్యవంతం కానుంది. ప్రజల రాకపోకలకు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు అందుబాటులో ఉండనున్నాయి. కావున డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంతోషంగా ఉంది



యాతవాకిళ్ల- హుజూర్‌నగర్ రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. యాతవాకిళ్ల నుంచి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లేందుకు రహదారి సక్రమంగా లేక గత కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. డబుల్ రోడ్డు నిర్మాణం జరిగితే కష్టాలు తీరనున్నాయి.

– వంటిపులి శ్రీనివాస్, యాతవాకిళ్ల

ప్రయాణం సుగమం కానుంది



మఠంపల్లి మండలంలోని రోడ్డు గత 10 ఏళ్లుగా బీటీకి నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. యాతవాకిళ్లకు డబుల్ రోడ్డు నిర్మించనుండడం సతోషకర విషయం. ఈ రోడ్డు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలకు చేరుకోవడం సుగమం అవుతుంది.

– భూక్యా నీలామంజీనాయక్, మాజీ జెడ్పీటీసీ, చెన్నాయిపాలెం

మా కల నెరవేరింది



యాతవాకిళ్ల రోడ్డు సింగిల్ లేన్‌గా ఉండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డును కమ్మచెట్లు కమ్మేయడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు డబుల్ రోడ్డు మంజూరు కావడంతో మా కల నెరవేరింది. రోడ్డు పూర్తయితే ప్రయాణం సులువు అవుతుంది.

– ధరావత్ నవీన్‌నాయక్, భీల్యానాయక్‌తండా

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



హుజూర్‌నగర్ : విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు



మఠంపల్లి : యాతవాకిళ్లలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, గ్రామపెద్దలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన పశ్య రామిరెడ్డి, పశ్య నర్సింహారెడ్డి- ధనలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుమారులు పశ్య ప్రవీణ్ రూ.10 వేల విలువైన నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, కంపాస్ బాక్సులు అందజేశారు. శనివారం వాటిని వార్డు కౌన్సిలర్లు బొల్లెద్దు ధనమ్మ, చిలకబత్తిని సౌజన్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పల్లా నాగలక్ష్మిలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ప్రవీణ్‌కుమార్‌ను హెచ్‌ఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాభాష, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, రశీద్‌ఖాన్, వెంకటేశ్వర్‌రావు, శౌరీ, ప్రభాకర్ రెడ్డి, అన్నపూర్ణ, నర్సింహారావు, మాధవి, కల్యాణి, భవాని, రవి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, శ్రవంతి, విజయలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

యాతవాకిళ్లలో..

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పుస్తకాలను శనివారం హెచ్‌ఎం వెంకట్రామ్, గ్రామ పెద్దలు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన బల్లాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుడిగె కాశయ్య, కుక్కల నాగరాజు, భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న హెచ్‌ఎం బట్టు మధు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ డివిజన్ అధికారి అనిత

అనంతగిరి : ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి అనిత అన్నారు. శనివారం అనంతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో పతంజలి ఫుడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించారు. అతి తక్కువ నీటి వినియోగంతోనే ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని తెలిపారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ సంస్థ మేనేజర్ వెంకట్, ఎం.నరేష్, జెడ్పీటీసీ కోణం ఉమ, ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, ఈదుల కృష్ణయ్య, మట్టపల్లి రామకోటయ్య, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ హర్షణీయం



మునగాల : సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

మునగాల : ఏకకాలంలో రూ.రెండు లక్షల రైతుల రుణమాఫీ అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కాలే సామియేలు అన్నారు. రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం బరాఖత్‌గూడెం గ్రామంలోని వీయూపీ బ్రిడ్జిలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సామియేలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకునే పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రుణమాఫీ చేసి రైతుల సంక్షేమం కోసం పాటుబడే ప్రభుత్వంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం చంద్రారెడ్డి, రెణబోతు రామిరెడ్డి, రెణబోతు వీరారెడ్డి, కుందూరు పిచ్చిరెడ్డి, దొంతిరెడ్డి మోహన్ రెడ్డి, దొంతిరెడ్డి రామనర్సిరెడ్డి, నర్సిరెడ్డి, చేగొండి శ్రీనివాస్, అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, మాదాసు నాగయ్య, ఇనుగుర్తి వీరాచారి, ముకర వీరయ్య, గడ్డం కోటేశ్వరరావు, జిల్లేపల్లి నాగయ్య, రాంబాబు, వెంకన్న, అక్బర్, నాగుల్‌పాషా, కోటేష్, రాయి వీరబాబు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీపై క్యాబినెట్ అమోదం తెలపడం పట్ల కోదాడ జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని, దీంతో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం జరగనుందని తెలి పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

రైతుల సమస్యలపై నిరంతర పోరాటం



వెలిదండలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

గరిడేపల్లి : రైతులు, కూలీల సమస్యల పరిష్కారానికి అఖిల భారత రైతు కూలీ సంఘం నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో రైతు కూలీ సంఘం సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేసిన ఘనత రైతు కూలీ సంఘానిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు వల్లపుదాసు లచ్చయ్య, కొమరయ్య, నాగయ్య, మల్లమ్మ, సంధ్య, కళ్యాణి, సువార్త, లక్ష్మి, వెంకటమ్మ, వెంకటయ్య, సరోజన, స్వరాజ్యం, అభిలాష్, శ్రీను, కామళ్ల శ్రీనివాస్, గండు నాగేశ్వరరావు, చెనగాని లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



గరిడేపల్లి : మాట్లాడుతున్న యాకుబ్



మఠంపల్లి : సమావేశమైన పంచాయతీ కార్మికులు

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే ధర్నాకు పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే యాకూబ్ పిలుపునిచ్చారు. కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడులో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. జీఓ నంబర్ 51ను సవరించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రయ్య, బాలకృష్ణ, సైదులు, హరీష్, నాగరాజు, వీరబాబు, సతీష్, వరప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల కమిటీ ఎన్నిక

మఠంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు, దుస్తులు అందజేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా కోరారు. శనివారం మఠంపల్లి మండలంలోని మట్టపల్లి గ్రామపంచాయతీ కార్యాలయలంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఆలేటి కాశయ్య, కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా భిక్షునాయక్, సభ్యులుగా విమలకుమారి, సైదానాయక్, నాగలక్ష్మి, కోటేశ్వరరావు, ప్రభాకర్, లక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డు వెడల్పులో భాగంగా నేరేడుచర్ల టౌన్- 1 ఫీడర్ చానల్ కింద ఎల్టీ విద్యుత్ లైన్లు, స్తంభాలు మారుస్తున్నందున జాన్‌పహాడ్ రోడ్డులోని గ్రోమోర్ షాపు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

సామాన్య ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్

హుజూర్‌నగర్‌రూరల్ : సామాన్య ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీతారెడ్డి, రామ్మూర్తి, కృష్ణారెడ్డి, అంతయ్య, నిర్మల, కోటయ్య, జ్ఞానయ్య, వీరయ్య, సైదిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించం

మిర్యాలగూడ : ఎస్ఎస్‌యూఐ పేరుతో కొందరు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, వారిని ఉపేక్షించేది లేదని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పేరుకు ఎవరూ భంగం కలిగించినా సహించమని, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోమన్‌కుమార్, విజయరామరాజు, గంగనా, చందు, శ్రీను, అరవింద్ పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి.. కాంగ్రెస్ ప్రభుత్వం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కోదాడ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేయాలని నిర్ణయించడాన్ని హర్షిస్తూ శనివారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీ చేసి ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, పారా సీతయ్య, ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కోటేశ్వరరావు, షేక్ ముస్తాఫా, గోపాల్, శ్రీను, అలీ, బుచ్చిపాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



ప్రకృతి వ్యవసాయదారులను సన్మానిస్తున్న సిరి ఫౌండేషన్ సభ్యులు, రైతులు

నడిగూడెం : మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయదారుడు నాగిరెడ్డి వెంకటరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శనివారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని గోపూజ చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయదారులు నాగిరెడ్డి వెంకటరెడ్డి, కన్నెబోయిన రామారావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగిరెడ్డి లింగారెడ్డి, నాగిరెడ్డి వీరారెడ్డి, వెంకటరెడ్డి, పెద వెంకటేశ్వర్లు, సీతారాం రెడ్డి, గుర్వారెడ్డి, వీరబాబు, సిరి ఫౌండేషన్ ప్రతినిధి గంటిపంగు నాగరాజు పాల్గొన్నారు.

నేడు వివేక్ స్మారకోపన్యాసం

సూర్యాపేట : తొమ్మిదేళ్ల క్రితం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సూర్యాపేట విద్యార్థి వివేక్ తొమ్మిదవ స్మారకోపన్యాసం ఆదివారం సూర్యాపేటలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు, మిత్రులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, సీఎస్ఆర్ ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్ రోడ్డులోని ట్రిపుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యతోనే సామాజిక గుర్తింపు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్ : విద్యతోనే సామాజంలో మంచి గుర్తింపు వస్తుందని డీఎస్పీ కె. రాజశేఖర రాజు అన్నారు. ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమం విద్యార్థులు శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారిని ఉద్దేశించి డీఎస్పీ మాట్లాడుతూ అనాథలు అనే విషయాన్ని మనస్సులోకి రానియకుండా బాగా చదివి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. వన్ టౌన్ సీఐ సుధాకర్, ఆశ్రమ నిర్వాహకులు హన్యానాయక్, అమృత, రమాబాయి, విద్యార్థులు వీణ, ఎలిజెబెత్, చందన, సుదారాణి, మౌనిక, భానుప్రకాశ్ ఉన్నారు.

శ్రీచైతన్య స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

భానుపురి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న శ్రీచైతన్య స్కూల్ బస్సులను వెంటనే సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. శనివారం జిల్లా రవాణాశాఖ అధికారి జయప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిమితికి మించి విద్యార్థులను ఇష్టానుసారంగా బస్సుల్లో ఎక్కిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి, పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం.. చిలుకూరు గ్రంథాలయం

- అందుబాటులో మూడు భాషల్లో 10 వేల పుస్తకాలు
- వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు
- మౌలిక వసతులు కల్పించాలని వేడుకోలు



చిలుకూరులో నూతనంగా నిర్మించిన బాపూజీ శాఖా గ్రంథాలయ భవనం



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న, నిరుద్యోగులు

చిలుకూరు : చిలుకూరు బాపూజీ శాఖ గ్రంథాలయం పోటీ పరీక్షల పుస్తకాలకు కేరాఫ్‌గా మారింది. దీంతో చిలుకూరుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగులు నిత్యం ఈ గ్రంథాలయానికి వచ్చి వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. గ్రంథాలయంలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో సుమారుగా 10 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. పదికి పైగా దినపత్రికలు, వార పత్రికలు అందుబాటులో ఉంటున్నాయి. 1942లో అష్టమ ఆంధ్రమహాసభ జరిగిన కాలంలో చిలుకూరు మండల కేంద్రంలో నాటి కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా రైతు గ్రంథాలయంగా దీనిని ఏర్పాటు చేశారు. కాలక్రమేణా 1969లో దీనిని బాపూజీ శాఖా గ్రంథాలయంగా మార్చారు. ప్రస్తుతం ఇది జిల్లాలోనే ఆదర్శ గ్రంథాలయంగా నిలుస్తోంది. కాగా, ఆనాడు ఏర్పాటు అయిన భవనం శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం భవనాన్ని కూల్చి ప్రభుత్వ నిధులు, గ్రామస్తులు, దాతలు సహకారంతో నూతన భవనం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం నిరుద్యోగ యువతకు ఆసరాగా నిలుస్తోంది. ఈ గ్రంథాలయం ఏర్పాటైన నాటి నుంచి ఎంతో మంది విద్యార్థులు ఇందులో ప్రిపేర్ అయి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత కూడా అదే మార్గంలో నిత్యం గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. కాకపోతే నూతనంగా నిర్మించిన ఈ గ్రంథాలయ భవనంలో మౌలిక సదుపాయాలు లేవని పాఠకులు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే పద్మావతి చొరవ తీసుకొని గ్రంథాలయంలో అన్ని రకాల వసతులు కల్పించాలని, అత్యాధునిక గ్రంథాలయంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



చిలుకూరు గ్రంథాలయానికి నిత్యం వస్తూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. నాతో పాటు చాలా మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. గ్రంథాలయంలో డీఎస్సీ, గ్రూప్స్‌కు సంబంధించిన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి. కానీ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు లేవు. కావున సౌకర్యాలు కల్పించాలి.

– అయితనబోయిన శిరీష, చిలుకూరు